క్లుప్తంగా

చెరువు పూడికతీత పనులు ప్రారంభం



చెరువు పూడికతీత పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదికర శివారు ప్రకాశపురంలో మంగళవారం స్థానిక చెరువు పూడికతీత పనులకు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అజాదీ కా అమృత్ సరోవర్ జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ.8 లక్షలతో ఈ పనులు చేపట్టనున్నట్టు ఆయన చెప్పారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, వీవర్స్ సొసైటీ అధ్యక్షుడు జాన శంకరరావు, నాయకులు కేఎస్ఎన్ రాజు, గెద్దం అమ్ములు, దొంగ నాగ సత్యనారాయణ, దూది త్రినాథ్, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ప్రమాదమని గుర్తించాలి

అంబాజీపేట: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరమని గుర్తించి దానిని నిర్మూలిద్దామని మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఎంపీటీసీ మట్టా పార్వతిలు అన్నారు. పంచాయతీ కార్యదర్శి జీవీవీ కుమార్ అధ్యంలో ప్లాస్టిక్ వాడకం, వాటి అనర్థాలపై అవగాహన, ప్లాస్టిక్‌ను నిషేధించాలంటూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్లాస్టిక్‌ను నియంత్రించాలంటూ నాలుగు రోడ్ల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుంకర పేరయ్యనాయుడు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కొబ్బరికి స్థిరీకరణ రేటు ప్రకటించాలి

అంబాజీపేట: కోనసీమ రైతుల జీవనాధారమైన కొబ్బరి ధరలు రోజురోజుకూ దిగజారుతున్న నేపథ్యంలో వాటికి స్థిరీకరణ రేటును ప్రకటించి రైతులను ఆదుకోవాలని మాచవరానికి చెందిన శ్రీ ధరణి రైతు సమాఖ్య ప్రభుత్వాన్ని కోరింది. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కొర్లపాటి కోటబాబు, నక్కా భాస్కరరావుల ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ టి.మంగతాయారుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు మట్టపర్తి పరమేశ్వరరావు, పరసా సత్తిబాబు, రవణం హరి తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారాన్ని అందించాలి

అంబాజీపేట: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసి ముద్దయిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడంతో పాటు పంట నష్టాన్ని రైతులకు అందించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, ఏఐసీసీ సభ్యుడు వీఆర్‌కే నాయుడు డిమాండ్ చేశారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నెల్లి వెంకటరమణ అధ్యక్షతన నిరసన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ టి.మంగతాయారుకు అందజేశారు. కార్యక్రమంలో ఎండీ ఆరిఫ్, ములపర్తి మోహనరావు, ఆదుర్తి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి

మామిడికుదురు: తడిసి రంగు మారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ టీడీపీ నేతలు మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ శరణ్యకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

అయినవిల్లి: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని టీడీపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సీహెచ్‌సీలో జనరేటర్ ప్రారంభించిన చిట్టిబాబు



పి.గన్నవరం సీహెచ్‌సీలో జనరేటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మంగళవారం జరిగిన స్థానిక సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. సీహెచ్‌సీ అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు, ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని అన్నారు. నాడు–నేడు నిధులు రూ.9 లక్షలతో కొనుగోలు చేసిన జనరేటర్, ఇన్వర్టర్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకు ముందు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులు, రోగులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆస్పత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ జీవీ సురేష్, డాక్టర్ అన్నాజీరావు, దొమ్మేటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

చదువుకుందాం రండి

- ఆకట్టుకుంటున్న వేసవి విజ్ఞాన కేంద్రాలు
- విద్యార్థులతో కళకళలాడుతున్న గ్రంథాలయాలు



అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్, జనరల్ నాలెడ్జ్ వివరిస్తున్న ఉపాధ్యాయులు

అంబాజీపేట: ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్‌లు, టీవీలకు అతుక్కుపోతూ సంప్రదాయ విలువలకు దూరంగా వెళ్లిపోతున్నారు. నిత్యం సెల్‌ఫోన్‌లతో బిజీగా గడిపే విద్యార్థులకు గ్రంథాలయాలను పరిచయం చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రవేశపెట్టారు. వచ్చే నెల జూన్ 16 వరకు విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించడానికి ఆయా శాఖ గ్రంథాలయాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. దీనికి వేదికగా చేసుకుని పాఠకుల సంఖ్య, సభ్యత్వాలను పెంచడానికి కొత్తపేట డివిజన్‌లో ఉన్న 11 మండలాల గ్రంథాలయ సిబ్బంది కృషి చేస్తున్నారు. దీని కోసం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల, కళాశాలల విద్యార్థులు వచ్చేలా ఏర్పాటు చేశారు. అంబాజీపేట, రాజోలు, కొత్తపేట, ఆలమూరు గ్రేడ్–2లోను, అంతర్వేదిపాలెం, సఖినేటిపల్లి, మల్కిపురం, మానేపల్లి, ఆత్రేయపురం, పి.గన్నవరం, అయినవిల్లి, గోపాలపురం గ్రేడ్–3లోను, మామిడికుదురు, రావులపాలెం, నరేంద్రపురం, కేశనపల్లి, కందికుప్ప, కొమరిపాలెం గ్రేడ్–4లోను శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. ఇవి కాకుండా బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా గ్రామీణ గ్రంథాలయాలు 56, పుస్తక నిక్షిప్త కేంద్రాలు 32 ఉన్నాయి. ఈ శాఖా గ్రంథాలయాలను వందలాది మంది స్థానికులు సద్వినియోగం చేసుకుంటున్నారు.

విద్యార్థులకు ఉపయోగపడేలా...

గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్‌పోటీలు, వ్యాస రచన, వక్తృత్వం పోటీలు, రంగవల్లులు చిత్రలేఖనం పోటీలు నిర్వహించడానికి సిద్ధం చేశారు. వీటిలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించనున్నారు. దీంతో పాటు చిన్నారుల కోసం చిన్న చిన్న కథల పుస్తకాలు, సైన్స్‌కు సంబంధించిన పుస్తకాలు, హాస్యం, జనరల్ నాలెడ్జ్, డ్రాయింగ్, రామాయణం, మహా భారతం, పాలిటెక్నిక్, ఐటీ, సివిల్‌కు సంబంధించి తదితర పుస్తకాలను కూడా పుస్తక ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థుల సభ్యత్వాలను పెంచేలా చేసి పుస్తకాలను ఇంటికి ఇచ్చి పుస్తకాలు చదివించేలా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పురాతన గ్రంథాలు, మంచి సమాచారం అందించే పుస్తకాలు కాలక్రమంలో శిథిలమైపోకుండా గ్రంథాలయంలో భద్రపరిచి వాటి విలువలను విద్యార్థులకు తెలియజేస్తున్నారు. సీఎం ప్రవేశపెట్టిన వేసవి విజ్ఞాన కేంద్రం కార్యక్రమం చిన్నారులతో పాటు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆకట్టుకుంటోంది. విద్యార్థుల్లో పఠనాశక్తి పెంచేందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయి.

ఎంతగానో ఉపయోగపడుతుంది



లైబ్రరీలో ఉన్న పుస్తకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. తెలియని విషయాలు ఎన్నో ఇక్కడ నేర్చుకుంటున్నాం. ముఖ్యనాయకుల జీవిత చరిత్రలు, అప్పటి జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదవడం వల్ల చాలా విషయాలు తెలుస్తున్నాయి. గంథాలయంలో ఉన్న పుస్తకాలు చదువుతుంటే సమయం తెలియడం లేదు. డ్రాయింగ్ వేయడం వంటివి గ్రంథాలయంలో నేర్పిస్తున్నారు.

– కుప్పాల భాగ్యశ్రీ, పదో తరగతి, అంబాజీపేట

విద్యార్థులు ఆకర్షితులవుతున్నారు



వేసవి విజ్ఞాన కేంద్ర ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుంది. గ్రంథాలయానికి వచ్చేలా విద్యార్థుల్లో చైతన్యం నింపుతున్నాం. వారికి నచ్చే కథల పుస్తకాలు, డ్రాయింగ్ తదితర వాటికి ఆకర్షితులై రోజు సుమారు 150 మంది విద్యార్థుల వరకు వస్తున్నారు. ఎక్కువగా కథలు, చరిత్ర పుస్తకాలను చదవడంతో పాటు ముఖ్యమైన సమాచారాన్ని నోట్ చేసుకుంటున్నారు.

– జి.శ్రీనివాస్, రికార్డు అసిస్టెంట్, శాఖా గ్రంథాలయం అంబాజీపేట

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాశర్లపూడిలంక గ్రామస్తులు

మామిడికుదురు: ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దడం వల్ల పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించారని సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు పేర్కొన్నారు. పాశర్లపూడిలంక బొరుసు తిరుపతయ్య మెమోరియల్ స్కూల్ 80 శాతం ఉత్తీర్ణత సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఎస్ఎస్ దుర్గాప్రసాద్, మొదటి సహోపాధ్యాయిని కేవీ విజయలక్ష్మిని సత్కరించారు. పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించారు. సర్పంచ్ సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎంతో కష్టపడి పని చేయడం వల్ల ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొరుసు గోపాలకృష్ణ, పితాని వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. పదో తరగతి ఫలితాల్లో మండలంలో మొదటి స్థానంలో నిలిచిన మొగలికుదురు విద్యార్థినులు పిచ్చిక వైష్ణవి, చింతా నాగవసంత, ద్వితీయ స్థానం పొందిన గుబ్బల అఖిల, చింతా సాయిలక్ష్మిలను ఎస్టీయూ మండల శాఖ ఘనంగా సత్కరించింది. విద్యార్థినులతో కేక్ కట్ చేయించారు. నలుగురు విద్యార్థులు మొగలికుదురు స్కూల్‌కు చెందిన వారు కావడం ఆనందంగా ఉందని మండల శాఖ అధ్యక్షుడు కేవీ రాఘవరావు, ప్రధాన కార్యదర్శి కె.కల్యాణ్‌బాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్.వెంకటేశ్వరరావు, నబీ హసన్, హెచ్ఎం టీఎస్‌కేడీ ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కార్యాచరణ

మామిడికుదురు: లూటుకుర్రులో జటిలంగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కారానికి కార్యాచరణ చేపట్టామని సర్పంచ్ అడబాల తాతకాపు పేర్కొన్నారు. పంచాయతీ పాలక వర్గ సమావేశం తాతకాపు అధ్యక్షతన మంగళవారం జరిగింది. వినాయక ఆలయం వద్ద రూ.17.10 లక్షలతో నూతన ట్యాంకు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. యన్‌జీఆర్ కాలనీలో పైప్‌లైన్ నిర్మాణానికి రూ.21.10 లక్షలు, భూతాలచెరువులో పైప్‌లైన్‌కు రూ.15.80 లక్షలు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. పైమూడు పనులకు పంచాయతీ నుంచి తీర్మానాలు చేశారు. సమావేశంలో ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం, వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా పళ్లాలమ్మ తీర్థం

కొత్తపేట: మండలంలోని వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మ తీర్థం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. దేవస్థానం కమిటీ చైర్మన్ కామిశెట్టి అమ్మన్న ఆధ్వర్యంలో ఈఓ బి.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తుల సౌకర్యార్థం వివిధ ఏర్పాట్లు చేశారు. సోమవారం రాత్రి అమ్మవారి పెద్ద జాతర ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి భక్తులు కుంకుమ పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం సిరిబండి ఉత్సవాన్ని యువకులు, బాలల కోలాహలం నడుమ వైభవంగా నిర్వహించారు. భక్తులందరికీ పులిహోర, మజ్జిగ సరఫరా చేశారు. పలు సేవా సంస్థలు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వానపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కేఎస్ఎస్‌బీ హర్ష ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక, స్థానికేతర ప్రాంతాల నుంచి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎస్సైని కలసిన వర్తక సంఘం ప్రతినిధులు

మలికిపురం: మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన జి.సురేంద్రను లక్కవరం వర్తక సంఘం ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం స్థానికపోలీస్ స్టేషన్‌లో ఈ మేరకు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఎస్సై వారితో మాట్లాడుతూ కూడళ్లలో వ్యాపార దుకాణాల వద్ద ట్రాఫిక్‌నకు ఇబ్బంది లేకుండా వ్యాపారస్తులు సహకరించాలని సూచించారు. సంఘ అధ్యక్షులు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు, పలచోళ్ల నారాయణరావు ఉన్నారు.

ఉపాధి పనులు నిలుపుదల చేయాలి

సఖినేటిపల్లి: వ్యవసాయ పనుల సీజన్‌లో ఉపాధి పథకం పనులు నిలుపుదల చేయించాలని మండల బీజేపీ శ్రేణులు మంగళవారం తహసీల్దార్ వై.రామకుమారి వినతిపత్రం అందజేశారు. వారు ఇచ్చిన వినతిపత్రంలో రైతులకు కూలీలు దొరక్క ఇబ్బందులు నేపథ్యంలో వీటికి ఉపాధి కూలీలను జతచేయాలని, అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు పూర్తి స్థాయిలో ఆదుకోవాలని కోరారు. అలాగే పలు సమస్యలను ప్రస్తావించారు. మాలే శ్రీనివాస నగేష్, చెంపాటి శివరామ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని అందిస్తూ అభివృద్ధి చేస్తున్నాం

- కొమరాజులంక, అప్పనపల్లిల్లో గడప గడపకూ..
- పాల్గొన్న ఎమ్మెల్యేలు జగ్గిరెడ్డి, చిట్టిబాబు



కొమరాజులంకలో పథకాల లబ్ధి వివరిస్తున్న ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి



అప్పనపల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

రావులపాలెం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే కాకుండా గ్రామస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను చేస్తూ ముందుకు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని కొమరాజులంకలోని సీతన్నగారి మొండి ప్రాంతం, వాటర్ ట్యాంక్ వీధి, నక్కలగూడు, రెడ్ల రామాలయం ప్రాంతాల్లో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారికి అందిన సంక్షేమాన్ని వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో నాడు నేడులో భాగంగా ఆధునీకరిస్తున్న పాఠశాలలు, సచివాలయాలు, ఆర్‌బీకే భవనాలు, వెల్నెస్ సెంటర్లు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధిని ప్రజలకు వివరించారు. సర్పంచ్ కర్రి గోవిందకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు హాజరై ఎమ్మెల్యే వెంట తిరిగారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ కర్రి వీర్రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అప్పారి విజయకుమార్, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, కోనాల రాజు, గాడి క్రిష్టాఫర్, దిడ్ల వీర్రాజు, చాంబర్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, సెక్రటరీ నిమ్మకాయల బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు: ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంటింటికీ సంక్షేమ పథకాల ఫలాలు అందాయని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం అప్పనపల్లిలో జరిగింది. ఎమ్మెల్యే చిట్టిబాబు గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును పరిశీలించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి వారి కుటుంబానికి బాసటగా నిలవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ఎమ్మెల్యే చిట్టిబాబు పేర్కొన్నారు. అర్హత కలిగిన వారి ఇంటికి వలంటీర్ నేరుగా వచ్చి సంక్షేమ పథకాలు అందించడం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, ఎంపీటీసీ బొంతు నీలిమ, పీఏసీఎస్ చైర్మన్ గెద్దం వెంకటేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, దేవస్థానం మాజీ చైర్మన్ పిచ్చుక చిన్న, గ్రామశాఖ అధ్యక్షుడు బత్తుల జనార్దన్, పార్టీ నేతలు గెద్దం వెంకటేశ్వరరావు, తులా గోపాలకృష్ణ, గూటం శ్రీను, లంకే ఏసు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో 'వసంత' పూజలు



ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ దంపతులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చైర్మన్ ఎమ్మెల్యేకు స్వామి చిత్రపటం అందించారు. ఈఓ మాట్లాడుతూ మర్రిపూడికి చెందిన పి.కృష్ణ, లక్ష్మి దంపతులు నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం అందించినట్లు తెలిపారు.

బైపాస్ విస్తరణపై ఆర్డీవో సమీక్ష



తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో వసంతరాయుడు

సఖినేటిపల్లి: మండలంలో ఎన్‌హెచ్ 216 నర్సాపురం బైపాస్ రోడ్డు విస్తరణ పనులపై రైతులతో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అమలాపురం ఆర్డీవో ఎస్ఎస్‌వీబీ వసంతరాయుడు సమీక్షించారు. ఈ మేరకు బైపాస్ రోడ్డు విస్తరణకు ప్రతిపాదించిన టేకిశెట్టిపాలెం, అంతర్వేదిపాలెం, రామేశ్వరం, సఖినేటిపల్లి గ్రామాల్లోని రైతులతో ఆయన మాట్లాడారు. వారి వద్ద నుంచి సర్వే నంబర్ల వారీగా భూముల వివరాలను తీసుకున్నారు. నష్టపరిహారం విషయంలో న్యాయం చేయాలని రైతులు అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. తహసీల్దార్ వై.రామకుమారి, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ భాస్కర్, సర్వేయర్ ఎస్.మధుసూదనరాజు, సీనియర్ అసిస్టెంట్ వి.రామరాజు, వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడా నైపుణ్యం సాధించాలి



వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభ సభలో మాట్లాడుతున్న అముడా చైర్మన్ డేవిడ్‌రాజు

కొత్తపేట: ప్రాథమిక స్థాయి నుంచీ విద్యతో పాటు క్రీడా నైపుణ్యం సాధించాలని అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు విద్యార్థులకు ఉద్బోధించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభించారు. బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ కోర్టులను అముడా చైర్మన్ డేవిడ్‌రాజు, ఎంపీపీ గంగాధరరావు పాఠశాల పీఎంసీ చైర్మన్ బీర శ్రీనివాసరావులు ప్రారంభించారు. సభలో డేవిడ్‌రాజు, గంగాధరరావు మాట్లాడుతూ క్రీడలు దేహదారుఢ్యానికి ఎంతగానో దోహదం చేస్తాయని, విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అందుకు క్రీడాకారులు ఈ బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం, పీడీ ఎంఎస్ మణికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, పీఈటీ వై.శ్రీనివాసరావు, కోచ్‌లు బి.శ్రీరామ్, ఎం.స్టీఫెన్‌కుమార్, రిటైర్డ్ పీఈటీలు, మాజీ క్రీడాకారులు పాల్గొన్నారు. తొలిరోజు 40 మంది క్రీడాకారులు శిక్షణలో పాల్గొన్నారు. నెల రోజుల పాటు కొత్తపేట పరిసర ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు ఆయా క్రీడల్లో శిక్షణ పొందనున్నారు.

సమస్యల పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం'

అంబాజీపేట/అయినవిల్లి: సంక్షేమ పథకాలు, సేవలకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం' ఎంతో ఉపయోగపడుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మిలు అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించడంతో తిలకించి వాటిపై అవగాహన కల్పించారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్య ఉన్న 1902 నంబర్‌కు కాల్ చేసి సమస్యను వివరించాలన్నారు. యువర్ సర్వీస్ రిక్వస్ట్ (వైఎస్సార్) ఐడీని కేటాయించి ఫిర్యాదు నమోదు చేస్తారన్నారు. ఎప్పటికప్పుడు ఫిర్యాది స్టేటస్‌ను అప్‌డేట్ అందిస్తారన్నారు. అలాగే అయినవిల్లి మండలం విలస గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్నకు చెబుదాం వీడియో కాన్ఫరెన్స్‌ను సర్పంచ్ లిల్లీ మంగేష్కర్ సిబ్బందితో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం అభివృద్ధికి ఏదైనా చేస్తా..

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



మంచినీటి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

ఆత్రేయపురం: చక్కటి ఆరోగ్యానికి పరిశుభ్రమైన ఆహారం ఎంత అవసరమో, ఆహ్లాదకర వాతావరణంలో నడక కూడా అంతే అవసరమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం ఆత్రేయపురంలో ఊరి మధ్యలో ఉన్న మంచినీటి చెరువును అభివృద్ధి చేసి దాని చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి గ్రామస్తుల అభ్యర్థన మేరకు అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పనులు ఇటీవల రూ.కోటితో ప్రారంభించారు. ఆ పనులు పరిశీలించేందుకు ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డితో పాటు రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ వాకింగ్ ట్రాక్ పూర్తైతే వ్యాయామం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రపంచ ఖ్యాతి గడిచిన పూతరేకులు పుట్టిన ఊరు ఆత్రేయపురం అభివృద్ధికి తామెప్పుడూ ముందుంటామన్నారు. రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ ఆత్రేయపురం గ్రామం ప్రశాంతతకు మరో పేరన్నారు. ఇలాంటి గ్రామంలో పార్కు నిర్మించి అందులో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రుడా నిధుల ద్వారా ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కప్పల శ్రీధర్, మాజీ ఏఎంసీ చైర్మన్ ముదునూరి రామరాజు, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, సర్పంచ్‌లు గాదిరాజు రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఉద్యాన పంటలపై అవగాహన పెంచుకోవాలి

ఆత్రేయపురం: ఉద్యాన పంటలపై రైతులు అవగాహన పెంచుకోవాలని ఉద్యానశాఖ డీహెచ్ఓ ఎస్.మల్లికార్జునరావు రైతులకు సూచించారు. ఆయన మంగళవారం మండలంలోని రాజవరం, వెలిచేరు, వద్దిపర్రు గ్రామాల్లో అరటి తోటలను పరిశీలించారు. ఈ నెలలో అకాల వర్షాలు, ఈదురుగాలుల వలన ఉద్యాన పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వై.సత్యనారాయణ, ఉద్యాన శాఖ అధికారి ఎం.అనూష, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆత్రేయపురం: మండలంలోని వాడపల్లి ఎస్సీ పేటకు చెందిన పోలిమాటి మహేష్‌కుమార్ (35) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. వివరాల ప్రకారం వాడపల్లికి చెందిన మహేష్‌కుమార్ సోమవారం బైక్‌పై వస్తుండగా విరిగిన విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో తలకు బలంగా గాయాలయ్యాయి. దీంతో అంబులెన్స్‌లో రాజహేంద్రవరం తరలిస్తుండగా మృతి చెందాడు. మహేష్‌కుమార్ సోదరుడు రమేష్‌కుమార్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంటిలో రక్తదాన శిబిరం

కొత్తపేట: భారతదేశం గర్వించదగ్గ ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను, ఆలోచనా విధానాన్ని యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్ పిలుపునిచ్చారు. అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని మంగళవారం గంటి పెదపేటలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కాకినాడ రోటరీ క్లబ్ బ్లడ్ బ్యాంక్ వారు రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన యువకుల నుంచి బ్లడ్ సేకరించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు

పి.గన్నవరం: పీఎంఎస్ఎంఏలో భాగంగా స్థానిక సీహెచ్‌సీలో మంగళవారం గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ జీవీ సురేష్, వైద్యాధికారులు 42 మంది గర్భిణులకు వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగా ఈశ్వరరావు, సభ్యులు ఫణికుమార్, హరిత, తిక్కిరెడ్డి లక్ష్మి భవానీల ఆధ్వర్యంలో గర్భిణులకు, వారి సహాయకులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఎంపీపీ అంబటి భూలక్ష్మి, ఎంపీడీఓ టీఎస్ వెంకటాచార్య, నాయకులు నల్లా పెదకాపు, తోలేటి దొరబాబు, సుబ్బారావు, రామకృష్ణ పాల్గొన్నారు. అలాగే నాగుల్లంక పీహెచ్‌సీలో వైద్యాధికారి కె.సుబ్బరాజు ఆధ్వర్యంలో 42 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. పాలకొల్లు బోళ్ల వీరాస్వామి సత్రం ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు.

అరటి సాగుపై అవగాహన

అంబాజీపేట: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం 2023ను అరటి సంవత్సరంగా ప్రకటించడంతో మంగళవారం స్థానిక పరిశోధనా కేంద్రంలో అరటి సాగుపై అవగాహన కార్యక్రమం జరిగింది. కేంద్ర అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త ఎ.కిరీటి అరటిలో మేలైన యాజమాన్య పద్ధతులు వివరించారు. తెగుళ్ల యాజమాన్యం పై పరిశోధనా స్థాన శాస్త్రవేత్త బి.నీరజ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలు విభాగాల శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా గండర దీపోత్సవం

అయినవిల్లి: మండలంలోని కొండుకుదురులో కొలువైన ఆర్ల అక్కమ్మకు మంగళవారం తీర్థం నిర్వహించారు. ఆర్ల అక్కమ్మకు పెద్ద ఎత్తున భక్తులు గండర దీపాలు సమర్పించారు. ఈ దీపాలను పళ్లెంలో ఉంచి భక్తులు శిరస్సున ఎత్తుకుని గ్రామ వీధుల్లో ఊరేగారు. మొక్కుల రూపంలో అమ్మవారికి గండర దీపాలు, దండుగమ్మ కావెళ్ల సమర్పించారు. సుమారు 10 వేల మంది భక్తులు పాల్గొన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.